క్లుప్తంగా

'సింగరేణి'లో వృక్షా బంధన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో బుధవారం వృక్షా రక్షాబంధన్ నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారు చేసిన రాఖీలను ఎన్విరాన్‌మెంట్ టీం విద్యార్థులచే వృక్షాలకు కట్టించారు. పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ డి.పూల్‌సింగ్, సైన్స్ టీచర్ మధురవాణి మాట్లాడుతూ.. వృక్షో రక్షతి రక్షిత: అన్న నానుడిని అనుసరించి మొక్కలు నాటి సంరక్షించాలని, మనం వాటిని కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని గ్రహించాలన్నారు.

'తుమ్మల'ను కలిసిన ఇల్లెందు నాయకులు

ఇల్లెందు: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెంటే ఉంటామని ఇల్లెందు ఏరియా తుమ్మల అభిమానులు, బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. బుధవారం గండుగులపల్లిలో ఇల్లెందు ఏరియా అభిమానులు, తుమ్మలను కలిసి మద్దతు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో బరిలో ఉండాలని కోరినట్లు తెలిపారు. కనగాల పేరయ్య, గౌరిశెట్టి సత్యనారాయణ, ప్రభునాథ్ యాదవ్, శ్రీనివాస్, ఎండీ ఆతహార్, కొప్పుల సమ్మయ్య తదితరులు ఉన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీల నూతన భవనాలు వేగవంతంగా జరిగేలా కృషి చేయాలని ఎంపీడీఓ బాలరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయని, పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడి మృతి

పాల్వంచ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమళ్ల వెంకటేశ్వర్లు (48) మంగళవారం రాత్రి పాత పాల్వంచలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వనమా రాఘవేందర్ రావు, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వర రావు, కొత్వాల సత్యనారాయణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

వేతనాలు చెల్లించండి

సింగరేణి(కొత్తగూడెం): రామవరం 8వ వార్డులోని మాతశిశు ఆస్పత్రిలోని శానిటేషన్ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, కౌన్సిలర్ కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. బుధవారం శానిటేషన్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేయింబవళ్లు ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి మూడు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించాలని కోరారు.

ముందస్తు అరెస్టులు

ఇల్లెందు: మంత్రి జగదీష్‌రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు వెళ్తున్న ఇల్లెందు ఏరియా బీఎస్పీ నేతలను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో శ్రీనివాసరావు, వీరేందర్, అనిల్ ఉన్నారు.

కొత్తగూడెంటౌన్: అరెస్టులతో ప్రజా చైతన్యాన్ని అడ్డుకోలేరని బీఎస్పీ జిల్లా సలహాదారు గందం మల్లికార్జున్ అన్నారు. బుధవారం హలో బహుజన చలో సూర్యాపేట కార్యక్రమానికి వెళ్తున్న బీఎస్పీ నాయకులు, కార్యకర్తలను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రెగ్యులరైజ్ చేయాలి

పాల్వంచ: జిల్లాలోని ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని జిల్లా ఆల్ డిపార్ట్‌మెంట్ ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు అన్నారు. బుధవారం కలెక్టర్ ప్రియాంక, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావులను కలిసి వినతిపత్రాలు అందించారు. మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ విధానాన్ని తొలగించి రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దిలీప్, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, శివ, శ్రావణ్, ఫిరోజ్, సోందు, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపండి

పాల్వంచరూరల్: రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాల్వంచ మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల ముసాయిదా జాబితాను పరిశీలనార్థం ఉంచామని దీనిపై అభ్యంతరాలు ఉంటే వచ్చే నెల 19 నాటికి తెలిజేయాలని తహసీల్దార్ సీహెచ్.నాగరాజు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. వంద శాతం ఓటు హక్కు నమోదు చేసుకునేలా రాజకీయ నాయకులు ప్రజలకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

కాలువ మట్టి మాయం

- సీతారామ కెనాల్ అధికారుల నిర్లక్ష్యంతో తరలిపోతున్న మొరం
- కాలువ కట్ట ధ్వంసంతో రైతుల ఆందోళన


కాలువ మట్టిని తవ్వుతున్న ప్రొక్లెయినర్

జూలూరుపాడు: మండలంలోని సీతారామ ప్రాజెక్టు కాలువ మట్టి మాయం అవుతోంది. అభివృద్ధి పనుల పేరుతో ఒకవైపు మట్టి తరలిస్తుండగా, మరోవైపు అక్రమార్కులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా యథేచ్ఛగా టిప్పర్లతో మట్టిని తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. నల్లబండబోడు, గుండెపుడి, జూలూరుపాడు, వినోభానగర్, పాపకొల్లు ప్రాంతం పరిధిలో సీతారామ కాలువ పనులు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణ పనులను ఓ ప్రైవేట్ కంపెనీ చేపడుతుండగా, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారు. భారీ స్థాయిలో చేపడుతున్న సీతారామ కెనాల్ పనులపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం కారణంగా నాణ్యతపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీతారామ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంటు పనులకు అవసరమైన కంకర కోసం అటవీ ప్రాంతంలో క్రషర్ మిల్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ తయారైన కంకరను ప్రాజక్టు పనులకు కాకుండా బయటకు తరలిపోతోంది. ఈ నేపథ్యంలోనే సీతారామ కెనాల్ నిర్మాణం కోసం తవ్విన మట్టిని రెండు వైపులా కట్టగా పోసి మట్టి రోడ్డును విశాలంగా ఏర్పాటు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలం వేపలగడ్డ సమీపంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడకు అవసరమైన గ్రావెల్ కోసం ఇంజనీరింగ్ అధికారులు సీతారామ కెనాల్ మట్టిని తరలించేందుకు కాంట్రాక్టర్‌కు అనుమతించారు. ఇంజనీర్లు పట్టించుకోకపోవడంతో అనుమతి గడువు తీరినా మట్టి తోలకాలు జరుగుతూనే ఉన్నాయి. మట్టి తోలకాలపై పలు ఆరోపణలు వస్తుండటంతో ప్రస్తుతం నిలిపివేశారు. వినోభానగర్ ప్రాంతంలోని కాలువ కట్ట మట్టిని టిప్పర్లతో తరలిస్తుండటంతో రోడ్డంతా ధ్వంసమైంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. జూలూరుపాడుకు చెందిన కొందరు వ్యక్తులు రెండు టిప్పర్లను లీజుకు తీసుకొని అక్రమ వ్యాపారానికి తెరలేపారు.


టిప్పర్లతో తరలిస్తున్న కాలువ మట్టి

ఒక్కో టిప్పర్ గ్రావెల్ లోడ్ రూ.6,000 అమ్ముకుంటూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రైవేట్ వెంచర్లకు సైతం ఇక్కడి మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయంపై సీతారామ ప్రాజెక్టు ఏఈ భూక్యా దేవదాస్ రాథోడ్‌ను వివరణ కోరగా... అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పంటలు దెబ్బతింటున్నాయి



కాలువ కట్టపై టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో పక్కన ఉన్న పంట పొలాలు దెబ్బతింటున్నాయి. మట్టి, దుమ్ము, ధూళితో పత్తి చేను నిండిపోయింది. కాలువ మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి తోలడం వల్ల కాలువ దెబ్బతినే ప్రమాదం ఉంది.
– సాయిన్ని నరసింహారావు, రైతు, వినోభానగర్

రోడ్డంతా ఆగమాగం



మట్టి లోడ్‌తో భారీ వాహనాలు తిరుగుతుండటంతో కాలువ కట్ట రోడ్డంతా ఆగమాగమైంది. గుంతలు పడటంతోపాటు, బురదతో అధ్వానంగా తయారైంది. పొలాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. కాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. – తంబారపు శ్రీను, రైతు, వినోభానగర్

పశువులను వెళ్లగొడుతున్నారు



కాలువ కట్టపై గడ్డి మేసేందుకు వచ్చిన పశువులను వెళ్లగొడుతున్నారు. అడవులు అంతరించిపోవడంతో పశువులను మేపేందుకు భూమి లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో వస్తే ఇక్కడ కాపలా ఉన్నవారు రానివ్వడం లేదు. కాలువ మట్టిని టిప్పర్లతో తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. – భిక్షమయ్య, రైతు, రాజారావుపేట

క్రమబద్ధీకరించే వరకు సమ్మె

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లిఖార్జున్ అన్నారు. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని బుధవారం సందర్శించారు. మాట్లాడుతూ 15 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. డీఎంహెచ్ఓ నిరసన శిబిరం వద్దకు వచ్చి సమ్మె ప్రజాస్వామ్య విరుద్ధమ ని, విధుల నుంచి తొలగిస్తామని, పరీక్షల్లో వెయిటేజీ మార్కులు తగ్గిస్తామని ప్రభుత్వ పెద్దల మాట గా చెప్పి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు.

డిమాండ్లను పరిష్కరిస్తాం: డీఎంహెచ్ఓ

రెండో ఏఎన్ఎంల సమ్మె శిబిరాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష బుధవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరిస్తుందన్నారు. సమ్మె విరమించకపోతే 30 శాతం వెయిటేజీ మార్కులు ఇవ్వమని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శిరీష

బెదిరింపులకు పాల్పడ్డారనడం సరైంది కాదు..

రెండో ఏఎన్ఎం సమ్మె శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా బెదిరింపులకు పాల్పడ్డారని అనడం సరైంది కాదని డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ఏఎన్ఎంల ఆవశ్యకత ఎంతో ఉందని, వారిని తిరిగి విధులలోకి చేరాలని కోరడం జరిగిందన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పానని పేర్కొన్నారు.

శ్మశానంలో 'పంచాయతీ'

టేకులపల్లి: మండలంలో పాతవి 12, కొత్తవి 24 మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో నూతనంగా ఏర్పడిన 24 పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇటీవల ఒక్కో పంచాయతీకి రూ.25లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా మేళ్లమడుగు పంచాయతీలో ప్రజలకు అనుకూలంగా ఉన్న స్థలంలో కట్టాల్సిన పంచాయతీ కార్యాలయాన్ని ఊరి చివరిలో శ్మశానవాటిక, డంపింగ్ యార్డు ఉన్న ఆవరణలోనే నిర్మిస్తున్నారు. ఈ విషయమై సర్పంచ్ మాడె మధుని వివరణ కోరగా.. గ్రామంలో ఎక్కడా ప్రభుత్వ స్థలం లేదు. స్థల దాతలు కూడా లేరు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో పంచాయతీ కార్యాలయం నిర్మిస్తున్నామని చెప్పారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో 'రాఖీ' సందడి


కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

చుంచుపల్లి: ఆర్టీసీ బస్టాండ్లలో ఒకరోజు ముందే రక్షాబంధన్ సందడి కనిపిస్తోంది. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు, ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికులతో కోలాహలం నెలకొంది. బుధవారం మధ్యాహ్నం నుంచి బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. రాఖీ పండుగ నేపథ్యంలో కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలో అధికారులు 50 వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, గోదావరిఖని, ఖమ్మం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు రూట్‌లలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. డిపో మేనేజర్లు, సిబ్బంది సర్వీసులను పర్యవేక్షిస్తున్నారు. రాఖీ పండుగ సందర్భంగా సాధారణ రోజుల కంటే రెట్టింపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

తోబుట్టువుల ప్రేమకు ప్రతీక రాఖీ

జూలూరుపాడు: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకోనున్నారు. పౌర్ణమి బుధవారం మధ్యాహ్నం ప్రవేశించడంతో గురువారం పండుగ జరుపుకోవాలని పండితులు నిశ్చయించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కా, చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ పువ్వు కట్టి స్వీట్లు తినిపించి నోరు తీపిచేస్తారు. శ్రావణ పూర్ణిమను రక్షాబంధనం పర్వదినంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయ వేడుక. శ్రావణ పౌర్ణమినే రాఖీ పౌర్ణమిగా పిలుస్తారు. మండల కేంద్రం జూలూరుపాడు ప్రధాన రహదారికి ఇరువైపుల వ్యాపారులు ప్రత్యేకంగా రాఖీ దుకాణాలు ఏర్పాటు చేశారు. మహిళలు, యువతులు, చిన్నారులు రాఖీ(రక్ష)లు కొనుగోలు చేయడంతోపాటు, మిఠాయి దుకాణాల్లో స్వీట్లు కొనుగోలు చేస్తున్నారు.

సుజాతనగర్: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ రానే వచ్చింది. నేడు రాఖీ పండుగ జరుపుకోనున్న నేపథ్యంలో మండల కేంద్రంలో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. మండల కేంద్రం సుజాతనగర్‌లో ఆయా దుకాణదారులు ప్రత్యేకంగా రాఖీ దుకాణాలను ఏర్పాటు చేశారు. రంగురంగుల రాఖీలు విభిన్న ఆకారాల్లో ఆకట్టుకుంటున్నాయి. రూ.10 నుంచి రూ.100 వరకు ఖరీదు చేసే రాఖీలను అందుబాటులో ఉన్నాయి. కార్టూన్స్‌తో తయారు చేసిన రాఖీలు చిన్నారులను ఆకర్షిస్తున్నాయి. రాఖీలతో పాటు స్వీట్లు, పూజా సామగ్రి మార్కెట్‌లో అమ్మకానికి ఉంచారు.


జూలూరుపాడు: దుకాణం వద్ద రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆర్డీఓకు సన్మానం

టేకులపల్లి: కొత్తగూడెం ఆర్డీఓగా శిరీష ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలం తడికలపూడి రేషన్ డీలర్, డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊకే శేఖర్‌రావు ఆధ్వర్యంలో మండలానికి చెందిన రేషన్ డీలర్లు ఆర్డీఓను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎల్.దేవ్‌సింగ్, ఆంగోతు సంతులాల్, పూల్ సింగ్, బాలు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

జూలూరుపాడు: పెద్దహరిజనవాడ, రాజారావుపేట, జడలచింత, జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మై ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో బుధవారం నోట్ బుక్స్ అందజేశారు.

కమీషన్ పెంచండి

పాల్వంచరూరల్: మీ సేవ నిర్వాహకులకు కమీషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ సీహెచ్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. మీ సేవలో చాలా సర్వీసులను తీసివేయడం వలన ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. 2018లో మీ సేవ నిర్వాహకుల సమస్యలపై జేఏసీ తరుపున సమ్మె నోటీసు ఇవ్వగా నాలుగు నెలల్లో సమస్యలను పరిష్కారిస్తామని ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. శ్రీరామ్మూర్తి, భవితారాణి, అమితాబ్ పాషా, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్


తహసీల్దార్‌కు రాఖీ కడుతున్న సమ్మక్క

కొత్తగూడెంరూరల్: అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను లక్ష్మీదేవిపల్లి మండల బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా కార్యాలయం, పోలీస్ స్టేషన్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం, ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలు సోదరులకు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్, మండల ప్రధాన కార్యదర్శి మాలోత్ గాంధీ, మహిళా మోర్చా నాయకులు సమ్మక్క, వరలక్ష్మి, రమాదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

టేకులపల్లి: సోదరుల మధ్య ఘర్షణ జరిగిన సంఘటనలో అన్నపై కేసు నమోదైంది. టేకులపల్లి ఎస్ఐ గనేరెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాలు.. బేతంపూడి గ్రామానికి చెందిన బానోతు ప్రసాద్, రాజా అన్నదమ్ములు. కొంతకాలంగా చేలో గట్టు విషయమై గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాజా ఇంటికి వెళ్లిన ప్రసాద్ రాజా భార్యను దుర్భాషలాడాడు. రాజాపై దాడి చేశాడు. రాజా భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలోని రామవరం ఏడు వార్డులలో నిర్మించనున్న రూ.30 కోట్ల అభివృద్ధి పనులకు బుధవారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు భూమి పూజ నిర్వహించారు. మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధిలో చెరగని ముద్రవేసుకున్నానని, చివరి రక్తపు బొట్టు వరకు కొత్తగూడెం ప్రజలకు సేవ చేస్తానన్నారు. కొత్తగూడెం ప్రజలు దేవుళ్లని, తాను పూజారిని, సీఎం కేసీఆర్, ఆయన తనయుడు కేటీఆర్‌లే తనకు ఆదర్శం అన్నారు. తానున్నా లేకున్నా... అభివృద్ధి చిరస్మరణీయంగా ఉండాలన్నదే తన ధ్యేయమన్నారు. కొత్తగూడెం ప్రజలు చైతన్యవంతులని డబ్బులకు అమ్ముడు పోయేవారు కాదని, నాకంటే ఎవరైనా అభివృద్ధి చేశారని నిరూపిస్తే రాజకీయాల నుంచి తొలుగుతానన్నారు. అనంతరం రాఖీ పండుగను పురస్కరించుకొని మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టారు. చిట్టి రామవరంలో మహిళలు నాట్యాలతో వనమాకు స్వాగతం పలికారు. వనమా రాఘవేందర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు మోరే రూప, విజయలక్ష్మి, కోలాపూరి ధర్మరాజు, వేముల ప్రసాద్, పల్లపు లక్ష్మణ్, పులి గీత, కంచర్ల జమలయ్య, మునిగడప పద్మ, భూక్యా శ్రీను, ఎంఏ రజాక్, కాసుల వెంకట్, జేవీఎస్ చౌదరి, గౌస్, దొమ్మేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

నిరుద్యోగులపై లాఠీచార్జ్ దారుణం..

జూలూరుపాడు: సీఎం కేసీఆర్ నిరుద్యోగుల పట్ల వివక్ష చూపుతున్నారని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పగడాల అఖిల్, ఎస్కె చాంద్‌పాషా విమర్శించారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన బీఈడీ, డీఈడీ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జీకి పాల్పడటం దారుణమన్నారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ 13 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించి, 5 వేల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పత్తిపాటి మహేష్, రాధాకృష్ణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


టేకులపల్లి: బొమ్మనపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

టేకులపల్లి: మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆదేశానుసారం బట్టు తండా, రావులపాడు, చుక్కాలబోడు, బొమ్మనపల్లి, మహాత్మాజ్యోతిబా పూలే బాలుర హాస్టల్‌లో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. 132 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బట్టు తండాలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డే నిర్వహించుకోవాలని, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు గుర్తించి దోమలు పుట్టకుండా మరియు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీళ్ల తాగడం మంచిదని, సాధ్యమైనంత వరకు వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సీతమ్మ, పార్వతి, ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, నాగు బండి వెంకటేశ్వర్లు, పల్లె దవాఖానా వైద్యులు హారిక, ధరణి, శైలజ ఏఎన్ఎంలు రమా కుమారి, కమల, పరంగిణి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కొమరారం పీహెచ్‌సీ పరిధిలోని కొమరారం, తుంటుబాలు తండా గ్రామాలలో బుధవారం దోమల నివారణ ముందును పిచికారీ చేశారు. వైద్యాధికారిణి డాక్టర్ లోహిత మాట్లాడుతూ.. కొమరారం, తుంటుబాలుతండా గ్రామాల నుంచి జ్వరపీడితులు అధికంగా ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు.

గ్రామాలలో ఇంటి పరిసరాల్లో, ఖాళీ పాత్రలలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధికి కారకాలవుతాయని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. జ్వరాలు పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కార్మికులకు ఏరియర్స్ చెల్లించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.22 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని, ఈ తరుణంలో కార్మికులకు 11వ వేతన ఏరియర్స్‌ను చెల్లించటంలో తీవ్ర జాప్యం సరైంది కాదని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పీవీకే – 5 షాఫ్ట్ గని ఆవరణలో కార్మికులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ వేతన ఒప్పంద 23 నెలల ఏరియర్స్ కోలిండియాలో ఆగస్టు జీతంతో (సెప్టెంబర్) నెలలో చెల్లిస్తున్నట్లు సర్క్యూలర్‌ను జారీ చేసినప్పటికీ సింగరేణిలో స్పందన లేదన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.20 వేల కోట్ల పైబడి కంపెనీకి రావాల్సి ఉందని వెంటనే వాటిని వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు రాజారావు, వై.వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రమేష్‌బాబు, బి.ప్రకాశ్, నాగేశ్వరరావు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణిలో కోల్ ఇండియా తరహాలో 11వ వేతన ఒప్పందం ప్రకారం ఆగస్టు నెల జీతంలో కలిసి సెప్టెంబర్ 3న చెల్లించాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను బీఎంఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాయని సైదులు కోరారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మాధవరెడ్డి, లీలాకృష్ణ, రాము, వెంకటేష్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, గణేష్, సైదులు, జయరాజ్, హన్మంతు, పరంజ్యోతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో భయం భయం

టేకులపల్లి: చింతోనిచెలక అంగన్‌వాడీ కేంద్రం సమస్యలకు నిలయంగా మారింది. సొంత భవనం లేక, అద్దె భవనం దొరక్క చిన్నారులు, టీచర్, సూపర్‌వైజర్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పలుచోట్ల నడిపిన తరువాత చివరకు ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఓ పాత భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక్కడ పది మంది చిన్నారులు ఉన్నారు. గర్భిణులు, బాలింతలు వచ్చిపోతుంటారు. ప్రహరీ లేకపోవడం, చుట్టూ చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. పాములు, కీటకాలు కూడా సంచరిస్తున్నాయి. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ భవనం కోసం 2019–20లో సీఎస్ఆర్ నిధులు రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఎట్టకేలకు భవన నిర్మాణం జరిగింది. నిధులు సరిపోక అసంపూర్తిగానే నిలిచిపోయింది. అదనంగా రూ.2.50లక్షలు అవసరం. గ్రామ పంచాయతీ నుంచి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ రాజకీయ కారణంగా జాప్యం జరుగుతోంది. పంచాయతీ రాజ్ ఏఈ, సర్పంచ్‌లు సత్వరమే స్పందించి త్వరితగతిన భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చింతోనిచెలక గ్రామంలో పాత భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

స్కూళ్లల్లో బోనాలు, రక్షాబంధన్ వేడుకలు


కొత్తగూడెంఅర్బన్: ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో బోనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు


పాల్వంచ: శ్రీ విద్య పాఠశాలలో స్వీట్లు తినిపించుకుంటున్న చిన్నారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో బుధవారం రక్షాబంధన్, శ్రావణ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శివసత్తులు, పోతురాజుల వేషధారణలో అలరించారు. దీంతోపాటు అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధాలకు ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఎస్ఆర్‌డీజీ జోనల్ ఇన్‌చార్జ్ వై.సతీష్, హెచ్‌ఎం తిరుమలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, స్వీట్లు తినిపించుకున్నారు.